క్లుప్తంగా

రేపు గ్రామసభ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ –2023లో భాగంగా గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏజెండా అంశాలపై చర్చించడంతో పాటు పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

అక్టోబర్ 4న ఎస్సీ ఉపకులాల ఆత్మగౌరవ సభ

జైనూర్: ఎస్సీ ఉపకులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మోహన్ దత్తా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సంఘం నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో అక్టోబర్ 4న నిర్వహించ తలపెట్టిన ఎస్సీ ఉపకులాల ఆత్మగౌరవ సభకు కుమురం భీం జిల్లాలోని ప్రతీ ఎస్సీ హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గైక్వాడ్ దత్తా, రాందాస్, కేశవ్, రామేశ్వర్, బలి రాం, శ్రీహరి, సుభాష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో జవహర్ నవోదయ విద్యాలయంతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ–స్వచ్ఛత అంశంపై శనివారం వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'పెంచిన మెస్‌చార్జీలు అమలు చేయాలి'



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: పెంచిన మెస్‌చార్జీలను వెంటనే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీకేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెంచిన మెస్‌చార్జీలు ఇప్పటివరకు అమలు చేయడం లేదన్నారు. దీంతో హాస్టళ్లలో చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించని లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దుర్గం జాఫర్, ఉపాధ్యక్షుడు సాయి కుమార్, నాయకులు రాము, అయూబ్ ఖాన్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



దోమల మందు వేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. శనివారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, మన చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. డ్రైనేజీల్లో దోమలు చేరకుండా పేరుకుపోకుండా జీపీ కార్మికులు నిత్యం శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి, వైద్య సిబ్బంది వినోద్, ఉత్తమ్, లక్ష్మీప్రసన్న, పరుశురాం ఉన్నారు.

'చలో సంక్షేమ భవన్ విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న శ్రీనివాస్

దహెగాం: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎన్నో ఏళ్లుగా గడుస్తున్నా ఇంతవరకు ప్రమోషన్లు, బదిలీలు చేపట్టకపోవడంతో అక్టోబర్ 4న హైదరాబాద్‌లో చలో సంక్షేమ భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చాపిడి శ్రీనివాస్ కోరారు. శనివారం మండలంలోని కల్వాడ ఆశ్రమ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. కార్యదర్శి తులసీరాం, మండల ప్రధాన కార్యదర్శి రోహిత్ ఉన్నారు.

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

- నిర్మాణం పూర్తయిన వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు
- ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం
- కరెంట్, నీటి సౌకర్యం లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా మోతుగూడ వైకుంఠధామం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డ్, సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. ట్రాక్టర్ ద్వారా గ్రామంలో తడి, పొడి చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నా వాటిని వేరు చేయడం లేదు. నిర్వహణ లేక సెగ్రిగేషన్ షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. వైకుంఠధామాలు పూర్తయ్యి మూడేళ్లు గడుస్తున్నా నేటి వరకు జిల్లాలో ఒక్కటి కూడా వినియోగించకపోవడం గమనార్హం.

జిల్లాలో 315 గ్రామపంచాయతీలు..

జిల్లా వ్యాప్తంగా 315 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీలో వైకుంఠధామాలు నిర్మించేందుకు 2019లో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటిలో ఆసిఫాబాద్ మండలంలో ఉన్న 27 జీపీల్లో, పీఆర్ శాఖ 22 గ్రామ పంచాయతీల్లో, ఈజీఎస్ ద్వారా నాలుగు జీపీల్లో, రూర్బన్ నిధుల నుంచి జిల్లా కేంద్రం ఒక జీపీలో నిర్మాణం చేపట్టారు. పీఆర్ శాఖ నుంచి నిర్మించిన వాటికి రూ.12.60 లక్షలు, ఈజీఎస్ ద్వారా నిర్మించిన వాటికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. జిల్లాలో సుమారు రూ.8.29 కోట్లతో 335 పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. కానీ వాటిని నిరుపయోగంగా వదిలేశారు.

సదుపాయాలు కరువు..

వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు ఒక్క వైకుంఠధామం ఇప్పటివరకు ప్రారంభించలేదు. వీటికి నీరు, కరెంట్ వంటి కనీస సౌకర్యాలు కల్పించలేదని దీంతో నిరుపయోగంగా ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని చోట్ల నాసిరకం పనులు చేపట్టడంతో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల గాలికి పైకప్పు రేకులు ఎగిరిపోయిన పరిస్థితి నెలకొంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించినా ప్రజలకు ప్రయోజనం కలగడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మరోవైపు ఆదివాసీ గ్రామాల్లో మృతి చెందిన వారిని తమ సంప్రదాయాల ప్రకారం సొంత భూమిలోనే దహన సంస్కారాలు చేస్తుండడంతో ఏజెన్సీ గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు నిరుపయోగంగా మారుతున్నాయి.

> **కరెంట్, నీటి సౌకర్యం లేదు**
>
> మండలంలో 27 గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ వాటికి నీరు, కరెంట్ సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.
>
> – ప్రసాద్, ఎంపీవో

ప్రమాదకరంగా డ్రైనేజీ



పొట్టి శ్రీరాములు చౌక్ వద్ద డ్రైనేజీలో కూరుకుపోయిన వాహనం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు చౌక్ వద్ద డ్రైనేజీ ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ కూరుకుపోయి మురికినీరు నిలిచిపోవడంతో దోమలు, దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శనివారం కురిసిన వర్షంతో డ్రైనేజీ కనిపించక వాహనం అందులో కూరుకుపోయింది. అధికారులు స్పందించి కొత్త డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

'ఉచిత అంబులెన్స్' ప్రారంభించిన ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని వినయ్‌గార్డెన్ చౌరస్తా (పెట్రోల్ పంపు ఏరియా)లో గల షణ్ముఖ ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో బెజ్జూర్ మండల ప్రజల సౌకర్యార్థం సమకూర్చిన ఉచిత అంబులెన్స్ వాహనాన్ని శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆస్పత్రి ఆవరణలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బెజ్జూర్ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి యాజమాన్య ప్రతినిధులు యాదవ వినయ్ కుమార్, సీహెచ్ యాదగిరి, కొలిపాక చంద్రశేఖర్, కొలిపాక సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూర్: మండలంలోని ఇప్పలగూడ గ్రామానికి చెందిన కనక దేవాజి గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా శనివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. మండల కేంద్రానికి చెందిన సర్వర్‌ఖాన్ భార్య సఫియా బేగం గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొండ్ర జగ్గాగౌడ్, జెడ్పీటీసీ పుష్పలత, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సకారాం, సహకార సంఘం మాజీ చైర్మన్ చోట వెంకన్న, మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్రంగి రాముకృష్ణ, నాయకులు సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం



సన్మానిస్తున్న మేనేజర్ విజయ్ సింగ్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి వృత్తి శిక్షణ కేంద్రంలో హెడ్ ఓవర్‌మెన్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన జలపతిరావును శనివారం శిక్షణ కేంద్రం మేనేజర్ విజయ్‌సింగ్‌తో పాటు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. వీటీసీ (ట్రైనింగ్) అధికారి మేడ రమేశ్, ఇన్‌స్ట్రక్టర్ మల్లాజు శ్రీనివాసరావు, క్లర్కులు సత్యనారాయణ, సిబ్బంది పార్వతి, మారుతులు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే టికెట్ ఆదివాసీలకే కేటాయించాలి'

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే టికెట్‌ను అన్ని పార్టీలు ఆదివాసీలకే కేటాయించాలని ఏబీఎం జిల్లా అధ్యక్షుడు పెందుర రాజేశ్ అన్నారు. శనివారం మండలంలోని మోవాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు తిరుపతి, జలపతి, భీంరావు తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయండి

నార్నూర్: మండలంలోని ఎంపల్లి తండా వద్ద వర్షానికి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని బీజేపీ నాయకుడు, న్యాయవాది బానోత్ జగన్ నాయక్ అన్నారు. శనివారం కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపల్లి తండా మీదుగా ఖడ్కి, లోకారి(కె), గాదిగూడ, పర్సువాడ మీదుగా ఆదిలాబాద్‌కు ప్రతిరోజు వందలాది మంది రాకపోకలు కొనసాగిస్తారన్నారు.

ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలి



ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

రెబ్బెన: ఓటుహక్కు ప్రాముఖ్యతపై యువత అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీశ్, స్వీప్ ఇన్‌చార్జి అధ్యాపకుడు ప్రకాశ్‌లు అన్నారు. ఓటుహక్కు ప్రాముఖ్యతపై శనివారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎంపీపీ



దర్శించుకుంటున్న ఎంపీపీ

కెరమెరి: మండలంలోని కెలికె గ్రామ పంచాయతీలోని అడవుల్లో గల ఆలయంలో కొలువైన జేరి పోచమ్మ అమ్మవారిని శనివారం ఎంపీపీ పెందోర్ మోతీరాం దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలాగే 12 గ్రామాలకు చెందిన పటేళ్లు, దేవారీలు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు ఎంపీపీని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నారాయణ, జగన్నాథ్‌రావు, దేవారి మదావి మాన్కు, చందసాహేబ్ తదితరులు ఉన్నారు.

ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న యువకులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో శనివారం సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని ముస్లిం యువకుల ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా పండ్లు పంపిణీ చేశారు. మీలాద్ ఉల్ నబీ పురస్కరించుకొని రోగులకు పండ్లు పంపిణీ చేశామన్నారు. డాక్టర్ జోగేందర్, ముఫ్తీ రఫీక్ ఖాన్, గ్రామ సభ్యుడు ఇఫ్తేఖార్‌ హుస్సేన్, నాయకులు హఫీజ్ అబ్దుల్ ఖలీల్, హఫీజ్ ఆరిఫ్, అబ్దుల్ మొయిజ్, అక్మల్ ఖాన్, జబి ఉల్లాఖాన్, అజ్మాన్, షరీఫ్, ఇజార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'దళిత కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందించాలి'



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: జీవో 342 ప్రకారం దళిత కుటుంబాలకు 101 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. శనివారం రెబ్బెన సబ్‌స్టేషన్‌లో ఏఈ ఇంజినీర్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు చాపిడి బాబాజీ, గజానంద్, మహేశ్, తిరుపతి పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ అంగన్‌వాడీల నిరసన



కెరమెరిలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

కెరమెరి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసనల్లో భాగంగా శనివారం భిక్షాటన చేపట్టారు. సీఐటీయూ నాయకుడు ఆనంద్, అనసూయ, ప్రవతి, కవిత, గుణసుందరి, అయ్యూబాయి, సంగీత, బొజ్జబాయి, లింగుబాయి, అనిత, ప్రమీల, తిరువన, గంగుబాయి, రేణుక తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని అంగన్‌వాడీలు శనివారం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో భాగంగా స్థానిక బస్టాండ్ ప్రాంతంలోని వ్యాపార సముదాయాల్లో, వారాంతంలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు విమల, అర్చన, ఉమారాణి, కల్పన పాల్గొన్నారు.

పొర్లు దండాలతో నిరసన

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె 20వ రోజుకు చేరుకున్నాయి. శనివారం దీక్షాశిబిరం వద్ద పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. నాయకులు వనిత, సూర్యమణి, శోభ, వరలక్ష్మి, లక్ష్మి, మంజుల, ధనలక్ష్మి, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం మండల కేంద్రంలో పొర్లు దండాలతో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంజాల ఓదెలు, అంగన్‌వాడీ ఉద్యోగులు రాజేశ్వరి, బాలమ్మ, చంద్రకళ, ప్రమీల, సాంబలక్ష్మి, సింధు తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా శనివారం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. జీజాబాయి, రాజేశ్వరి, సునీల, సౌందర్య, అనిత, విమల, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల మానవహారం



ఆసిఫాబాద్‌అర్బన్: మానవహారంలో ఆశ వర్కర్లు

కెరమెరి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న ఆశ వర్కర్ల సమ్మె శనివారం ఆరో రోజుకు చేరింది. స్థానిక పెట్రోల్ బంక్ ఎదుట మానవహారం చేసి తమ నిరసనలు తెలిపారు. సీఐటీయూ నాయకుడు ఆనంద్, ఆశ కార్యకర్తలు అరుణ, భారతి, సావిత్రి, దుర్గ, నీలాబాయి, లక్ష్మి, లలిత, సరోజ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: ఆశ వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తలపెట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా 7వ రోజు శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్లు మానవహారంతో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, నాయకులు కాంత, అమృత, రోజా, సునీత, కృష్ణవేణి, రాంబాయి, నవీన, భారతి తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: ఆశ కార్యకర్తల డిమాండ్లను నెరవేర్చాలని ఆశ కార్యకర్తలు మండల సంఘం అధ్యక్షురాలు ఓమ్మెబాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. సంఘం ప్రధాన కార్యదర్శి అర్చన కోటంబే, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న ఆశ వర్కర్లు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

తిర్యాణి: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని కుమురంభీం చౌక్ వద్ద ఆశ వర్కర్లు మానవహారం నిర్వహించారు. అధ్యక్షురాలు బద్రుబాయి, నాయకులు అనసూర్య, జంగుబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం వర్కర్ల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న ఎండీఎం వర్కర్లు

కెరమెరి: మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు శనివారం నుంచి సమ్మెలోకి వెళ్తున్న సందర్భంగా ఎమ్మార్సీ సిబ్బంది మహేందర్, అశ్వినికి సమ్మె నోటీసు అందజేశారు. జీవో నంబర్ 8 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంబాల లక్ష్మి, లలిత, రజిత, కవిత, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు కమిషనర్ అంజయ్యకు శనివారం సమ్మె నోటీసు అందజేశారు.

'ఎమ్మెల్సీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి'



మాట్లాడుతున్న కార్యదర్శి సిడాం గణపతి

కౌటాల: బహుజన సమాజ్‌పార్టీ నీలి జెండా ఆదరిస్తేనే గతంలో సిర్పూర్ ఎమ్మెల్యేగా కోనేరు కోనప్ప గెలిచారని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాంప్రసాద్, నాయకులు నవీన్, సందీప్, గోవిందరావు, బండు, ప్రకాశ్, తిరుపతి పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రహీముద్దీన్

వాంకిడి: మండలంలోని బెండారా గ్రామంలో శనివారం తహసీల్దార్ రహీముద్దీన్ పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చట్టంలోని మానవ హక్కులను తెలుసుకోవాలన్నారు. ఎస్సై సాగర్, ఆర్ఐ ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రజలు రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని నవేగాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై సైతం అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సర్పంచ్ వదాయి మాధవి, ఆర్ఐ ప్రేంకిరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడలు

రెబ్బెన: డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ వార్షిక క్రీడల్లో భాగంగా శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో డిపార్ట్‌మెంటల్ బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో శ్రైగిరూడ జీవో జట్టు, ఎస్‌వోటుజీఎం జట్టు తలపడగా శ్రైగిరూడ పీవో జట్టు విజయం సాధించింది. పోటీని అధికారి నవీన్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరి పాల్గొన్నారు.